క్లుప్తంగా

దాతల సహకారం మరువలేనిది



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ ఆలయ అభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిదని చైర్మన్ జంగాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన చావ మృత్యుంజయరావు, నాగసూర్యమణి సహకారంతో వారి కుమార్తె, అల్లుడు ఐనవోలు మాధవీలత, రాఘమారుతిరావు సుమారుగా రూ.5లక్షలతో ఆధునీకరించిన శ్రీతిరుపతమ్మ అమ్మవారి సత్రాల్లోని రెండు గదులను శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సత్రాల గదులు ఆధునీకరించిన దాతలను అభినందించారు. ఆలయ అభివృద్ధిలో దాతల భాగస్వామ్యం అవసరమన్నారు. ఇప్పటికే ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.కోటితో డార్మెటరీ నిర్మించారని తెలిపారు. గదుల నిర్మాణానికి, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందించాలని భక్తులను కోరారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ ఎల్.రమ, ఏఈవో ఉమాపతి, తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు, ఆలయ ధర్మకర్త పాలాది వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమం



పెనుగంచిప్రోలు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం చిన్నారులు, తల్లులకు పోషకాహారం అందిస్తోందని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఈసీసీఈ (పూర్వ ప్రాథమిక విద్య)పై కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ చిన్నారులను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలని పంపించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటల ద్వారా విద్యనందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారులు, వారి తల్లులు పాల్గొన్నారు.

15వ ఆర్థికసంఘం నిధులు విడుదల




చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.13 కోట్లు విడుదలైనట్లు ఎంపీడీవో నితిన్ శనివారం తెలిపారు. అన్నవరంనకు రూ.3.90 లక్షలు, అనుమంచిపల్లికి రూ.8.46 లక్షలు, బలుసుపాడుకు రూ.4.60లక్షలు, బండిపాలెం రూ.9.93 లక్షలు, బూదవాడ రూ.11లక్షలు, ధర్మవరప్పాడుతండ రూ.7లక్షలు, గండ్రాయి రూ. 13.96లక్షలు, గౌరవరం రూ. 9.91లక్షలు, జయంతిపురం రూ.8.18 లక్షలు, కె.అగ్రహారం రూ. 5.73లక్షలు, మల్కాపురం రూ. 6లక్షలు, ముక్త్యాల రూ.6.20 లక్షలు, పోచంపల్లి రూ.8.29 లక్షలు, రామచంద్రునిపేట రూ.1.69 లక్షలు, తక్కెళ్లపాడు రూ.3.95లక్షలు, వేదాద్రి రూ. 4.80 లక్షల చొప్పున విడుదలైనట్లు వివరించారు. నిధులు ఆయా సర్పంచ్‌ల ఖాతాల్లో జమ అయినట్లు తెలిపారు. చిల్లకల్లు, షేర్‌మహ్మద్‌పేట, తిరుమలగిరి గ్రామాలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల కాలేదని వివరించారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

కంచికచర్ల: మండలంలోని గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులకు జొన్నలగడ్డ రామయ్య, ధనలక్ష్మీ జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాసరావు 100 భోజనం ప్లేట్లను శనివారం అందజేశారు. ఎస్‌ఏ-1లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు హెచ్‌ఎం రామకృష్ణ తెలిపారు. భోజనం పేట్లు అందించిన శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



నందిగామటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు చిరుమామిళ్ల శ్రీనివాసరావు కుమారుడు అరవింద్ 11వ వర్ధంతిని పురస్కరించుకుని కుటుంబసభ్యులు శనివారం మాగల్లు గ్రామంలోని కెకె వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చిరుమామిళ్ల అరవింద్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.11ఏళ్లుగా ఉచిత కంటి వైద్యశిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో క్రాంతి, వృద్ధాశ్రమ నిర్వాహకుడు ఖాశీం పాల్గొన్నారు.



జగ్గయ్యపేట-బూదవాడ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న దూళ్లవాగు బ్రిడ్జి



జగ్గయ్యపేట-ముక్త్యాల రోడ్డులో రెయిలింగ్ లేని పాలేటి బ్రిడ్జి



పెనుగంచిప్రోలు-అనిగండ్లపాడు రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

ప్రమాద వారధులు

- గ్రామాల్లో శిథిలమైన వంతెనలు..
- పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో వాహనచోదకులు, ప్రజలు

జగ్గయ్యపేట: నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఏళ్ల కిందట నిర్మించిన బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని పలు బ్రిడ్జిల రెయిలింగ్‌లు దెబ్బతిని ప్రమాదభరితంగా మారడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనచోదకులు, ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

మండలంలోని జగ్గయ్యపేట-బూదవాడ గ్రామానికి వెళ్లే దూళ్లవాగు వద్ద ఉన్న బ్రిడ్జిపై రెయిలింగ్ లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. బ్రిడ్జి కూడా శిథిలావస్థకు చేరటంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వచ్చిన పాలేటి వరదకు బ్రిడ్జి పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలు సాగించేందుకు భయాందోళన చెందుతున్నారు. అంతేకాకుండా జగ్గయ్యపేట-ముక్త్యాల రహదారిలోని పద్మావతినగర్ వద్ద పాలేటి బ్రిడ్జిపై రెయిలింగ్ కూడా లేకపోవడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినసమయంలో ఎక్కడ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గండ్రాయి గ్రామ ముంగిట ఉన్న బ్రిడ్జి సైతం ప్రమాదకరంగా ఉంది.



కొణకంచి-బండిపాలెం రోడ్డులో నాగారపువాగుపై శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి

సగం కూలిన బ్రిడ్జి..

పెనుగంచిప్రోలు మండలంలోని అనిగండ్లపాడు వెళ్లే రహదారిలో మునేటి కాల్వపై ఉన్న బ్రిడ్జి ఇరువైపులా రెయిలింగ్ దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా వెల్దుర్తిపాడు, శనగపాడు, లింగగూడెం గ్రామాలకు వెళ్లే చప్టాల రెయిలింగ్ కూడా శిథిలావస్థకు చేరింది. కొణకంచి-బండిపాలెం వెళ్లే రహదారిలో నాగారపు వాగుపై ఉన్న బ్రిడ్జి సగం కూలిపోగా మిగిలిన సగం బ్రిడ్జి మీదుగానే వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. బండిపాలెం సమీపంలోని చెరువు వాగుపై రెయిలింగ్ లేకపోవడంతో ఇక్కడ కూడా ఎప్పుడు ఏప్రమాదం చోటుచేసుకుంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

భయంభయంగానే ప్రయాణం..

వత్సవాయి మండలంలోని మంగొల్లు-దేచుపాలెం, ఆళ్లూరుపాడు-వేమవరం, కంభంపాడు-లింగాల, మంగొల్లు-డబ్బాకుపల్లి రోడ్డులోని బ్రిడ్జిల రెయిలింగ్ కూడా శిథిలాస్థకు చేరడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు ఈ బ్రిడ్జిల రెయిలింగ్‌కు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ నాణ్యతలోపం కారణంగా కొద్దిరోజులకే తిరిగి శిథిలావస్థకు చేరుతుండటం గమనార్హం. ముఖ్యంగా రాత్రివేళల్లో ఈబ్రిడ్జిల మీదుగా ప్రాణాలు అరచేత పట్టుకుట్టుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాహనచోదకులు, ప్రజలు చెబుతున్నారు. ఇకనైనా పాలకులు స్పందించి ఆయా బ్రిడ్జిలకు మరమ్మతులు చేపట్టాలని, పూర్తిగా దెబ్బతిన్న వాటిస్థానంలో నూతన బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

రూ.40లక్షలతో అంచనాలు రూపొందించాం..

జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రహదారులపై అధ్వానంగా ఉన్న కల్వర్టుల మరమ్మతులతోపాటు రైలింగ్ ఏర్పాటు చేసేందుకు రూ.40లక్షలతో అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరు కాగానే ఆయా పనులు చేపడతాం.

పరుశురాముడు, ఆర్‌అండ్‌బీ డీఈఈ

అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

కమిషనర్‌కు నాయకుల వినతి



కమిషనర్ రమణబాబుకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నందిగామటౌన్: రాజకీయపార్టీలకు అతీతంగా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అధికారులు కూడా పార్టీలకనుగుణంగా పనిచేయడ బాధాకరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకునే విషయంలో పార్టీ తదితర భేదాలు చూడకుండా మున్సిపల్ అధికారులు అందరికీ ఒకే విధానం అమలుచేయాలని కోరారు. ఈమేరకు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు ఓర్సు లక్ష్మి, పాకాలపాటి కిరణ్ తదితరులు మున్సిపల్ కమిషనర్ రమణబాబును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పండుగలకు శుభాకాంక్షలు చెబుతూ పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో టీడీపీ ఫ్లెక్సీలు ఉంచి, అనుమతి లేదనే సాకుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలు తొలగించడం బాధాకరమన్నారు. ఫ్లెక్సీల ఏర్పాటుకు పరిమితి, అనుమతులు కూడా ఒకే విధంగా ఉండాలన్నారు. అంతేకాకుండా ప్రైవేట్ భవనాలపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సైతం తొలగించటమేమిటని ప్రశ్నించారు.కమిషనర్ రమణబాబు స్పందిస్తూ టీడీపీకి చెందిన 16 ఫ్లెక్సీలకు అనుమతులున్నాయన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎక్కడెక్కడ, ఏసైజుల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తారో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అనుమతులు ఇస్తామని సమాధానమిచ్చారు. కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు చిరుమామిళ్ల శ్రీనివాసరావు, మందా మరియమ్మ, మన్నెం దాసు, షేక్ యాకుబ్‌అలీ, షేక్ జాఫర్, బండారు వెంకట్రావ్, ఓర్సు జ్వాలా, బండిరు శేషు, పిల్లి జయరాజు, బెజవాడ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి : సౌమ్య



విద్యార్థినులతో కలసి భోజనం చేస్తున్న ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

కంచికచర్ల: ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు అధ్యాపకులు నాణ్యమైన విద్యనందించాలని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య సూచించారు. కంచికచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే 1.48లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం కింద మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. 398కళాశాలలను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలకు అనుసంధానం చేసినట్లు వివరించారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హాఫీజ్ షేక్ అహ్మద్, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవి సేవాసమితి జిల్లా అధ్యక్షుడుగా 'యన్నాకుల'



రాంబాబుకు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేటఅర్బన్: శ్రీవాసవి సేవాసమితి జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి యన్నాకుల రాంబాబు, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ప్రముఖ వ్యాపారి పేరూరి నరసింహారావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడుగా చౌట రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు సేవాసమితి జారీచేసిన నియామకపత్రాలను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తననివాసంలో శనివారం వారికి అందజేసి అభినందించారు. సేవా సమితి జాతీయ అధ్యక్షుడు సురేష్‌శెట్టి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల మధ్య సంబంధాలు, సేవాభావాన్ని పెంపొందించేందుకు ఈ సేవాసమితిని 9ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సేవాసమితి ద్వారా తెలుగురాష్ట్రాల్లో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న సురేష్‌శెట్టిని ఎమ్మెల్యే తాతయ్య అభినందించారు. కార్యక్రమంలో సేవాసమితి రాష్ట్ర నాయకులు సోమేశ్వరరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాయగూరల్లో మెండుగా పోషకాలు

నందిగామటౌన్: అంగనవాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు తాజా కాయగూరలతో వండిన ఆహారాన్ని అందించాలని సీహెచ్‌వో వర్షిణి సూచించారు. మండలంలోని మాగల్లు అంగనవాడీ కేంద్రంలో శనివారం వెజిటబుల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలు అధికంగా ఉండే అన్నిరకాల కాయగూరలను చిన్నారులు తినేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, అంగనవాడీ కార్యకర్తలపై ఉందన్నారు. ముఖ్యంగా తాజా కాయగూరలతో వండిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన కాయగూరల వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేటలో విస్తృతంగా కార్డన్ సెర్చ్



కార్డన్ సెర్చ్‌లో భాగంగా సోదాలు నిర్వహిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాజు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. స్థానిక విలియంపేట, క్రిస్టియన్‌పేట, మిట్టగూడెం, చెరువుబజారు మినీబైపాస్ రోడ్‌తో పాటు పలు ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీ చేశారు. పలుఇళ్లను సోదా చేశారు. ఈసందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్ఐ జి.రాజు మాట్లాడుతూ తెలంగాణ మద్యం తెచ్చి అమ్మకాలు సాగిస్తే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

రెవెన్యూ సదస్సులకు 86అర్జీలు

పెద్దాపురం(వీరులపాడు):మండలంలోని పెద్దాపురంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయా భూసమస్యల పరిష్కారం కోరుతూ గ్రామస్తులు 77అర్జీలు అందజేశారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, ఎంపీడీవో అరుంధతీదేవి, సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బలుసుపాడులో..

బలుసుపాడు(జగ్గయ్యపేట): మండలంలోని బలుసుపాడులో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయా భూసమస్యలను పరిష్కరించాలంటూ రైతులు ఐదు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్ మాట్లాడుతూ సదస్సుల్లో భూ వివాదాలు, దేవాదాయ, అటవీ తదితర సమస్యలపై దరఖాస్తులు వస్తున్నాయని, వాటిని పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సర్వేయర్ అనూష్ బాబు, ఆర్ఐ నూరమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

పరిటాల(కంచికచర్ల): మండలంలోని పరిటాలలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయా భూసమస్యల పరిష్కారం కోరుతూ రైతులు నాలుగు అర్జీలు అందజేశారు. తహసీల్దార్ పి.జాహ్నవి మాట్లాడుతూ అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని వివరించారు. డీటీ మానస, ఆర్ఐ వెంకట్, వీఆర్వో సురేష్, రైతులు పాల్గొన్నారు.

ఎంఈఓ తీరుపై ఎంపీపీ, జెడ్పీటీసీ ఆగ్రహం



ఎంఈఓ బాలాజీనాయక్‌ను ప్రశ్నిస్తున్న ఎంపీపీ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రశాంతి

కంచికచర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందా? లేదా? అని పర్యవేక్షించాల్సిన ఎంఈఓ, కూటమి నాయకులకు తొత్తుగా వ్యవహరిస్తూ పాఠశాలలను పట్టించుకోవడంలేదని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మలక్‌బషీర్ అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఎంఈఓ బి.బాలాజీనాయక్ విద్యాశాఖ పనితీరును వివరిస్తుండగా...ఎంపీపీ మలక్‌బషీర్, జెడ్పీటీసీ ప్రశాంతి జోక్యం చేసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందా? లేదా? అని విచారించాల్సిన మీరు కూటమి నాయకుల చెప్పుచేతల్లో ఉంటూ సరిగ్గా పర్యవేక్షించడం లేదంటూ ఆయనపై మండిపడ్డారు. ఎమ్మెల్యేలు, సర్పంచులు గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను రోడ్డుపైకి తీసుకువచ్చి నాయకులకు పూలుచల్లించడమేమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు కనీసం నోటీసు ఇవ్వకుండా వారిని ఎలా తొలగిస్తారంటూ ఎంఈఓను నిలదీశారు. ముడుపులు ఇవ్వలేదనే సాకుతో పాఠశాలల్లోని ఆయాలను విధులను తొలగించడమేమిటని ప్రశ్నించారు. ఎంఈఓ బాలాజీనాయక్‌కు ప్రైవేటు పాఠశాలలపై ఉన్న శ్రద్ధ, ప్రభుత్వ పాఠశాలలపై లేదని మండిపడ్డారు. ఇటువంటి ఎంఈఓ మండలానికి అవసరం లేదని పలువురు ఎంపీటీసీ సభ్యులు ఎంఈఓ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వాదాయానికి గండిపై చర్చ..

మండల పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు 22ఏళ్లుగా ఎటువంటి టెండర్లు లేకుండా తక్కువ అద్దెతో షాపులు కేటాయిస్తున్నారని ఎంపీటీసీ సభ్యుడు బర్రె ఉదయ్‌కిరణ్ సమావేశం దృష్టికి తెచ్చారు. తద్వారా ప్రభుత్వాదాయానికి భారీగా గండిపడుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ షాపులను మొదట ఎవరు అద్దెకు తీసుకున్నారో, వారే ఇన్నేళ్లుగా కొనసాగుతున్నారని గుర్తుచేశారు. కాంప్లెక్స్ సమీపంలో ఒక్కో షాపు అద్దె రూ.15 నుంచి రూ.20వేల వరకు ఉండగా, కాంప్లెక్స్‌లోని షాపులకు మాత్రం అద్దెదారులు కేవలం రూ.1700 మాత్రమే చెల్లిస్తున్న వైనాన్ని సమావేశం దృష్టికి తెచ్చారు. తద్వారా రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయల మేర గండిపడిందని వివరించారు. టెండర్ విధానం అమలుచేస్తే ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు అమేరకు చర్యలు తీసుకోకపోవడంపై ప్రశ్నించారు. కొందరు అద్దెదారులు ఇతరులకు ఆయా దుకాణాలను అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారని ఆరోపించారు. ఇకనైనా అధికారులు స్పందించి టెండర్ల ప్రక్రియ ద్వారానే షాపులను అద్దెకు కేటాయించాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు బండి మల్లికార్జునరావు, వెలగలేటి మాధవి, సర్పంచి వేల్పుల సునీత, ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

నందిగామటౌన్: పండుగల సందర్భంగా యువత దురలవాట్లపై దృష్టి సారించకుండా సంప్రదాయ క్రీడలపై ఆసక్తి చూపాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించారు. పట్టణంలోని అనాసాగరంలో వంగవీటి మోహనరంగా మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో సంక్రాంతి పండుగ సందడి కనిపిస్తోందన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రీడలతో శారీర ధారుఢ్యంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనం పంపించాలని వినతి



సీనియర్‌అసిస్టెంట్ శ్రీదేవికి వినతిపత్రం అందజేస్తున్న జగనన్న కాలనీవాసులు

జగ్గయ్యపేటఅర్బన్: బలుసుపాడు రోడ్డులోని ఉన్న జగనన్నకాలనీ ఎల్‌పీ-2లో ఎండీయూ వాహనం ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేయించాలని కాలనీవాసులు, రెవెన్యూ అధికారులను కోరారు. ఈమేరకు వారు శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయ ఎస్‌ఏ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జగనన్న కాలనీవాసులు కనపర్తి సత్యంబాబు, జక్కులూరి సురేష్, మార్కపూడి బాబు, సత్యనారాయణ చౌదరి మాట్లాడుతూ రేషన్ సరుకులు ఇచ్చే వాహనం కాలనీకి రాకపోతుండటంతో ప్రతినెలా రెండు కిలోమీటర్ల దూరంలోని జగ్గయ్యపేటకు వచ్చి రేషన్ సరుకులు తీసుకునేందుకు అవస్థలుపడుతున్నామని తెలిపారు. ఇకనైనా పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించి రేషన్ బియ్యం సరఫరా చేసే ఎండీయూ వాహనం తమ కాలనీకి వచ్చేలా చూడాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో కాలనీవాసులు ఎం.సంతోషకుమారి, కవిత, సుజాత, గోపి, పద్మ, నాగరాజు, లక్ష్మీనారాయణ, సైదులు, జానకి, అనూష ఉన్నారు.

బాల్యవివాహాల నియంత్రణకు పటిష్ట చర్యలు

వీరులపాడు: లింగ వివక్షత, బాల్య వివాహాల నియంత్రణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని నందిగామ ఐసీడీఎస్ సీడీపీవో వి.భాగ్యరేణుక పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరులో 'కిశోరి వికాసం' కార్యక్రమంపై ఆయాశాఖల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాల ఎస్ఎస్ ఉపాధ్యాయుడు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, జీఎంఎస్‌కె, ఏఎన్ఎంలతో గ్రామస్థాయిలో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో కెనడీ, ఏసీడీపీవో కృష్ణకుమారి, కెవికె శాస్త్రవేత్త ప్రభావతి, సీహెచ్‌వో లలితకుమారి, కిరణ్, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'హైందవ శంఖారావం'కు తరలిరావాలంటూ ర్యాలీ

నందిగామటౌన్:హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) సభ్యులు తొర్లికొండ సీతారామయ్య, వందేమాతరం అశోక్ పేర్కొన్నారు. విజయవాడ సమీపంలోని కేసనపల్లి వద్ద ఆదివారం నిర్వహించనున్న హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరుతూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ర్యాలీ చేశారు. వారు మాట్లాడుతూ శంఖారావంలో ప్రతిఒక్క హిందువు పాల్గొనాలని కోరారు. ర్యాలీలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.